పాత మిత్రులు..కొత్త పలకరింపులు



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని టీఎంరావు హైస్కూల్‌లో 1987–1988లో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. మూడున్నర దశాబ్దాల వారి అనుభవ ముచ్చట్లు సమయం తెలియకుండా సాగిపోయాయి. ఆత్మీయ పలకరింపులతో పులకించిపోయారు. మధ్య వయస్సులో.. మళ్లీ విద్యార్థులై అల్లరి చేశారు. 150 మంది క్లాస్‌మేట్స్‌లో.. 135 మందికి పైగా సతీసమేతంగా హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ముద్దా లీలా మోహన్ రావు, దీవి వేంకట నరసింహాచార్యులు, బీహెచ్ఎస్‌కే చక్రవర్తి, లక్కరాజు రాధాకృష్ణమూర్తి, అన్నె రవికుమార్, లాల్‌జాన్ భాషా, టి.పార్వతమ్మ, పి.కనక వసంతంను సన్మానించుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పోతాబత్తుని వెంకట రమణారావు, యర్రంశెట్టి విజయ సారథి, పంచుమర్తి శ్రీనివాసరావు, తూనుగుంట్ల గంగాధర్, తిరువీధుల దేవాజి, కె.ఆంజనేయులు, భట్టిప్రోలు ఉషారమణి, దండిభోట్ల శైలజ, భట్టిప్రోలు శ్రావణి, ఆత్మూరి సుబ్బారావు కృషి చేశారు. పాఠశాల హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు, పాలకవర్గ అధ్యక్షులు పి. మల్లిఖార్జునరావు, కోట వెంక సుబ్బారావు, సీహెచ్ నరసింహారావు, జి. పున్నారావు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితం.. 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు

కొల్లూరు/రేపల్లె రూరల్ : ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం కొల్లూరు బాలురోన్నత పాఠశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. పురుషుల క్రికెట్‌లో దోనేపూడి, కొల్లూరు–2 జట్లు, మహిళల క్రికెట్‌లో కొల్లూరు–3, చినపులివర్రు జట్లు, కబడ్డీలో గాజుల్లంక జట్టు, మహిళల విభాగంలో కొల్లూరు–3, కొల్లూరు–1 జట్లు, పురుషుల వాలీబాల్ పోటీల్లో కొల్లూరు–3, చినపులివర్రు జట్లు, మహిళల విభాగంలో దోనేపూడి, రావికంపాడు జట్లు ఫైనల్‌లో తలపడనున్నాయి. రేపల్లె ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, క్రికెట్ పోటీలను మున్సిపల్ కమిషనర్ విజయసారథి పర్యవేక్షించారు.

పంట నమోదు ప్రక్రియ ప్రారంభించాలి

భట్టిప్రోలు: రబీ సీజన్‌కు పంట నమోదు ప్రక్రియ ప్రారంభించాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం (ఎంఏఏబీ) నిర్వహించారు. పీఎం కిసాన్, ఈకేవైసీ ఈ నెల 19లోగా రైతులు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఏఓ జి.మీరయ్య, ఎంఏఏబీ చైర్మన్ రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

'దత్త గాన లహరి' సీడీ ఆవిష్కరణ

బాపట్ల అర్బన్: బాపట్ల శంకర విద్యాలయం వేదికగా శ్రీ రావినూతల శ్రీరామ్మూర్తి రచించిన 'దత్త గాన లహరి' పుస్తకం, సీడీ ఆవిష్కరణ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని దత్తాత్రేయ స్వామి సన్నిధిలో వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు జె.నాగ పూర్ణ రమాదేవి మాట్లాడుతూ దత్తాత్రేయ గీతాల్ని స్వరపరచడం సంతోషకరమన్నారు. రావినూతల కుటుంబ సభ్యులు గాయకులను, కళాకారులను సత్కరించారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్ఎం కళాశాల అభివృద్ధికి కృషి

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



నగరం: తీర ప్రాంతంలో ఎంతో చరిత్ర కలిగిన శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం కళాశాల పాలక వర్గం మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ఆర్కే ప్రసాద్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి ఎస్ఆర్కే ప్రసాద్ కృషి మరువలేనిదని కొనియాడారు. తొలుత ఎస్ఆర్కే ప్రసాద్ విగ్రహన్ని ఆవిష్కరించారు. కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు, నామా నందిత ప్రసాద్, నామా పృథ్వీతేజ, నర్రా కృష్ణప్రసాద్, కరస్పాండెంట్ బుచ్చియ్య చౌదరి పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా కమలాత్మిక హోమం



బాపట్ల అర్బన్: శ్రీ లలితా త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల విశేష పూజా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నుంచి బాపట్ల చీలురోడ్ వద్ద గల శ్రీ పాండురంగ స్వామి దేవాలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా కమలాత్మిక హోమం, శ్రీలక్ష్మీ పుష్పార్చన కార్యక్రమం జరిగింది. పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో భారీగా విచ్చేసిన భక్తుల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్గశిర అమావాస్య మహాలక్ష్మీ స్వరూపమైన కమలాత్మికదేవి భూలోకంలో తామర పుష్పంలో జన్మించిన పర్వదినాన అమ్మవారికి ప్రీతికరమైన పుష్పాలను, కుంకుమతో అలంకరించి సుగంధహోమ ద్రవ్యాలతో అర్చించటం ద్వారా అఖండ ధన సంపద, ఆయురారోగ్య సంప్రాప్తిస్తాయని హనుమంతరావు తెలిపారు. పూజాకార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ పాల్గొని, పూజలు నిర్వహించారు. అర్చకులు మేడూరి వెంకట అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురామ్, వంగులూరు కౌండిన్య, గూడూరు సాయివెంకట్ యాజ్ఞీకం నిర్వహించారు. ఆలయధర్మకర్త మార్జూరి బదరీనారాయణ, భక్త సమాజం నిర్వాహకురాలు పాల్గొన్నారు.



అభివృద్ధి పథంలో బాపట్ల



బాపట్ల పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్

బాపట్ల: జిల్లా కేంద్రమైన బాపట్ల అభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోంది. బాపట్ల పట్టణంలో రోడ్ల విస్తరణ పూర్తి చేసుకుని, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోయింది. ఒక పక్కన జాతీయ రహదారి, మరోవైపు జీబీసీ రోడ్డు విస్తరణ పూర్తి చేసుకుని వెన్నెల ఆరబోసిన విధంగా విద్యుత్ వెలుగుల్లో నిండిపోయింది. రూ.550 కోట్లతో మెడికల్ కళాశాల పనులు వేగంగా సాగుతున్నాయి. మరోవైపు పర్యాటక రంగం అభివృద్ధిలో ముందు వరసలో ఉంది. సూర్యలంక పర్యాటక కేంద్రంతోపాటు వాడరేవు ప్రాంతంలో కూడా రిసార్ట్స్ సంస్కృతి వ్యాప్తి చెందటం, టూరిస్ట్‌లను ఆకర్షించేవిధంగా ఉంది. బాపట్ల, చీరాల జంట నగరాలు జిల్లాను అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి.











దుప్పట్లు పంపిణీ చేసిన సినీ రచయిత కోన




కర్లపాలెం: పేదలకు చేయూతనందించేందుకు ఎమ్మెల్యే కోన రఘుపతి కుటుంబం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రముఖ సినీ రచయిత, నిర్మాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన వెంకట్ తెలిపారు. కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పంపిన దుప్పట్లను శుక్రవారం కొత్త నందాయపాలెంలో పింఛనుదారులకు కోన వెంకట్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతిని ఎమ్మెల్యేగా, ప్రజా రంజకమైన పరిపాలన అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, కో–ఆప్షన్ సభ్యుడు అమీర్ బేగ్, పెద పులుగువారి పాలెం సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆట్ల అయ్యప్పరెడ్డి, మందపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, పివి సురేష్, తాజుద్దీన్, సత్యనారాయణరెడ్డి, డానియేల్, బెనర్జి, జానీ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పిట్టలవానిపాలెం: పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఖాజీపాలెం గ్రామంలో ఐదుగురు పేకాట ఆడుతుండగా చందోలు ట్రైనింగ్ డీఎస్పీ దాడి చేసి, అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13,860లు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.







మారుమూల గ్రామాలకూ వైద్యం



కోనేటిపురం శిబిరంలో కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కోనేటిపురం(భట్టిప్రోలు): మారుమూల గ్రామాలకూ వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ ఉదయ భాస్కరి పేర్కొన్నారు. కోనేటిపురం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. వైద్యులు ఎ. శ్రీనివాసరావు, స్పెషలిస్ట్ డాక్టర్లు తులసి కిరణ్, జ్యోత్స్న, ప్రియాంక, ఆప్తమాలజిస్ట్ అరుణరాణి వైద్య సేవలు అందించారు. రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, ఆళ్ళమూడి సర్పంచ్ పెద్దిశెట్టి రాంబాబు, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



చర్చి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: ఏసుక్రీస్తు సూక్తులను ప్రతి ఒక్కరూ ఆచరించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. లంకెవానిదిబ్బ గ్రామంలో నూతనంగా నిర్మించిన బైబిల్ ఫెయిత్ లూథరన్ చర్చిని శుక్రవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించుము అని క్రీస్తు చెప్పిన వాఖ్యం ప్రజలు ఆచరించాలన్నారు. ప్రత్యేక ప్రార్థనలో ఎంపీ పాల్గొన్నారు. చర్చి అభివృద్ధికి లక్ష రూపాయలను విరాళమిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, సంఘ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

తీరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రేపల్లె రూరల్: తీరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రాజు కాల్వ పంచాయతీలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా జరుగుతున్న ఇంటింటికి తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ పంచాయతీలో రూ.85 లక్షలతో ఇంటింటికి కుళాయి, పైపు లైన్‌లు, ఎస్ఎస్ ట్యాంక్‌లు, తాగునీటి చెరువులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్మాణ పనులు పూర్తయితే రాజుకాల్వ పంచాయతీలోని లక్ష్మీపురం, రాజులచెరువు, శాంతినగర్ గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దైవ చింతనతో సంతోష జీవనం

నగరం: దైవాన్ని భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే సుఖ సంతోషాలతో జీవించవచ్చని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. బెల్లంవారిపాలెం శ్రీరామ మందిరంలో శుక్రవారం జరిగిన అయ్యప్పల ఇరుముడి మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటేశ్వరావు, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఉపాధ్యాయుడు మురళీమోహన్‌కు ప్రతిభా పురస్కారం



భట్టిప్రోలు: వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం లభించింది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తన తల్లిదండ్రుల పేరున ఏర్పాటు చేసిన కేవీఆర్, విజయలక్ష్మి ట్రస్ట్ తరఫున ఆయన పురస్కారానికి ఎంపికైనట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 28న గుంటూరులో జరిగే ప్రతిభా పురస్కార ఉత్సవంలో ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో మురళీమోహన్ విశేష కృషి చేశారని పేర్కొన్నారు.

యువత దేశానికి వెన్నెముక



యల్లాప్రగడ సీతాపతికి వివేకానంద పురస్కారం ప్రదానం

ఐలవరం(భట్టిప్రోలు): భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, హిందూ ధర్మ గొప్పతనాన్ని విదేశాల్లో చాటిన ఘనత స్వామి వివేకానందుడికే దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్), వివేకానంద విద్యా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐలవరంలో స్వామి వివేకానంద 161వ జయంత్యుత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో జరిగిన సభకు సంస్థ అధ్యక్షుడు, ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అధ్యక్షత వహించారు. యువతే దేశానికి వెన్నెముక అని పేర్కొన్నారు. 2024-వివేకానంద పురస్కారం నగరానికి చెందిన యల్లాప్రగడ సీతాపతికి ప్రదానం చేశారు. ఆయన ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దడమే కాక ఆధ్యాత్మిక వేత్తగా హిందూ ధర్మ రక్షణ కోసం కృషి చేస్తున్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ ఎ.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, క్రాప రవికుమార్, బూర్లె అరుణకుమారి, వి. కోటేశ్వరరావు, కెబీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి స్ఫూర్తితో ముందుకు

వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.161వ జాతీయ యువజనోత్సవాలు భట్టిప్రోలు వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మినీ ట్యాంక్ బండ్ వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, జె.వెంకటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, ముద్దా లీలామోహన్‌రావు, వంగర చలమయ్య సిద్ధాంతి, చందలూరి రామకోటేశ్వరరావు, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం

కర్లపాలెం: వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకమైనవని కర్లపాలెం రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టీవీ సుబ్బారావు అన్నారు. వివేకానంద 162వ జయంతి సందర్భంగా శుక్రవారం ఎంవీఆర్ డిగ్రీ కళాశాల, పీకేఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు స్థానిక రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులతో కలసి కళాశాలలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, పీకేఆర్ జూనియర్ కళాశాల ఫార్మర్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎంవీ రాజుపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి ఆరె వెంకటేశ్వర్లు, బాపిరాజు, చందు పిచ్చయ్య, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

అభివృద్ధి దిశగా చెరుకుపల్లి



ఢిల్లీ పబ్లిక్ స్కూల్



చెరుకుపల్లిలోని అంబేద్కర్ సెంటర్

చెరుకుపల్లి: అభివృద్ధి దిశగా చెరుకుపల్లి ముందుకు వెళ్తోంది. జాతీయ రహదారి గ్రామం మధ్య నుంచి నిర్మించడంతో రోడ్డుకు ఇరువైపులా పలు వ్యాపార సముదాయాలు నిర్మించారు. రోడ్డు విశాలంగా ఉండి ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రయాణాలకు సౌకర్యవంతంగా ఉంది. ఒకప్పుడు ఏ వస్తువు కొనుగోలు చెయాలన్న తెనాలి, గుంటూరు, రేపల్లె వంటి పట్టణాలకు ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా సువిశాలమైన బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతుండటంతో టీవీ, సెల్ ఫోన్, హోమ్ నీడ్స్, టెక్స్ టైల్, పర్నీచర్ వంటి కార్పొరేట్ షోరూంలు ఇక్కడ వెలిశాయి. దీంతో చెరుకుపల్లితోపాటు చుట్టుపక్కల సుమారు 40 గ్రామాల ప్రజలకు ఈ షోరూంలు అందుబాటులో ఉండట వల్ల ప్రయాణ సమయం అదా అవుతోంది. విద్యా పరంగా కూడా ఈ పాంత్రానికి మంచి పేరు ఉంది. డీఎస్సీ, గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు శిక్షణ పొందే అభ్యర్థులకు ఇక్కడే కోచింగ్ సెంటర్లు ఉండటంతో విద్యార్థులు ఇక్కడ కోచింగ్ తీసుకునేందుకు సులువు మార్గమైంది. ప్రభుత్వ కొలువులు పొందినవాళ్లు చాలమంది ఉన్నారు. ఈ ప్రాంతంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వంటి కార్పొరేట్ స్కూల్ ఉండటం కూడా ఈ పాంత అభివృద్ధికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వేడుకలు జరుపుకోవడం కోసం ఒకప్పుడు నానాయాతనపడే ఈ ప్రాంత వాసులకు ఇప్పుడు అధునిక హంగులు ఇతర సౌకార్యలతో పంక్షన్ హాల్స్ అదుబాటులోకి వచ్చాయి. ఇక్కడ కలప వ్యాపారం జిల్లా స్థాయిని మించి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందనటంలో అచ్చర్యం లేదు. ఇక్కడ తయారు చేసిన పర్నీచర్ వస్తువులు మన రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తారు. పెంకుటిళ్లు, సావిళ్లకు అవసరమైన తాటి వాసాలకు చెరుకుపల్లి బాగా ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో తయారైన చేనేత వస్త్రాలకు రాష్ట్రావ్యాప్తంగా గుర్తింపు ఉంది. వ్యవసాయంలోనూ చెరుకుపల్లి ప్రాంతం మేటిగానే ఉంది. ఈ ప్రాంతంలో వరి, మినుము, వేరుశనగ, జోన్న, మొక్కజోన్న ప్రధాన పంటలు పండించి ఎగుమతి చెస్తున్నారు. రైతులు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

పరిపాలన అధికారిగా మధుసూదనరెడ్డి బాధ్యతలు



పిట్టలవానిపాలెం: మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారిగా మధుసూదనరెడ్డి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కొల్లిపర ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మధుసూదనరెడ్డి గతంలో పిట్టలవానిపాలెం మండలంలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించారు.

హ్యాండ్ వాషింగ్ స్టేషన్ ప్రారంభం

బాపట్ల: చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ పేర్కొన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో హ్యాండ్ వాషింగ్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లిక్విడ్‌తో చేతులు శుభ్రం చేసుకోవటంతో.. కరోనా వంటి విపత్తు నుంచి బయట పడేందుకు అవకాశం ఉందని తెలిపారు. మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: ఇసుకపల్లిలోని 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపల్లె పట్టణ, గ్రామీణ ప్రాంతాలు, భట్టిప్రోలు మండలంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.